
# ఊర్వశి పాలసీ

కథ

డా॥ గాయత్రీదేవి

స్వర్గలోకంలో దేవతలంతా సమావేశం అయ్యారు. అందరి మొహాలలోనూ కలవరం కనపడుతోంది. కళకళలాడుతూ, ఆరోగ్యంగా వుండవలసిన భూదేవి కళారహితంగా, అనారోగ్యంగా కనపడడమే వారి కలవరానికి కారణం. భూదేవి కళ తప్పడానికి గల కారణాలు కనిపెట్టి ఆవిడలో పూర్వ కళనీ తీసుకురావాలన్నది సమావేశ లక్ష్యం. సభాసదులంతా ఆశీనులయ్యాక, ఇంద్రుడు వచ్చి సింహాసనాన్ని అధిష్ఠించాడు. భూదేవిని సభికులలో నుంచి వచ్చి వేదిక మీద వున్న ప్రత్యేక సింహాసనాన్ని అలంకరించమని ఆహ్వానించాడు. అడుగు తీసి అడుగు వెయ్యడానికి కష్టపడుతూ, ఆయాస పడుతూ, అతిప్రయాస మీద వేదికను చేరి సంహాసనంలో ఇరుక్కుని కూర్చుంది భూదేవి. భూదేవి పడుతున్న బాధని బాధగా చూశారు సభికులు.



''భూదేవీ, నీకు వచ్చిన కష్టం ఏమిటి? నీ అనారోగ్యానికి కారణం ఏమిటి? నీ ఆరోగ్యం కోసం మమ్మల్ని ఏం చెయ్యమంటావో తెలియజెయ్యి'' అని తన సహస్రాక్షాలలోనూ, స్వరంలోనూ బాధని వ్యక్తం చేస్తూ ప్రశ్నించాడు ఇంద్రుడు.

భూదేవి ఇంకా ఆయాస పడుతూనే వుంది. ముక్కుతో ఊపిరి అందక నోటితో గాలి పీల్చు కుంటోంది. ఆవిడ నోట మాట రావడం లేదు.

''వెంటనే అశ్వినీ దేవతలను పిలిపించండి'' ఆజ్ఞాపించాడు ఇంద్రుడు.

అశ్వినీ దేవతలు ప్రత్యక్షమయ్యారు. భూదేవిని ఆయుర్వేద వైద్యానుసారం అష్టవిధ పరీక్షలు చేశారు.

''కారణం కనిపెట్టారా?'' అన్నాడు ఇంద్రుడు ఆదుర్దాగా.

''ఇతర కారణాలేమీ లేవు. కళ్లకి కనపడుతున్న కారణమే.

''ఏమిటది?''

''భూదేవిభారం విపరీతంగా పెరిగిపోయింది మహేంద్రా. ఈ భారం ఇంకా పెరిగే సూచనలు కనపడుతున్నాయి. అదే ఆవిడ అనారోగ్యానికి కారణం. ఈ భారం ఇలాగే వుంటే అది మరిన్ని వ్యాధులకి దారితీస్తుంది.''

''వెంటనే చికిత్స ప్రారంభించండి''

''నిదాన పరివర్ధనం చెయ్యాలి.''

''మీ వైద్యుల భాషలో కాకుండా మాకు అర్థం అయ్యేలా చెప్పండి.''

''కారణాన్ని తీసెయ్యాలి. అనారోగ్యానికి కారణం. పెరిగిన భూభారం. ఆ భారాన్ని తగ్గించాలి'' అన్నారు అశ్వినీ దేవతలు.

''మన శరీరం బరువు పెరిగితే ఆహారం తగ్గించుకునో, వ్యాయామం చేసో తగ్గించుకుంటాం. భూదేవి విషయం అలా కాదు కదా'' అని సందేహం వెలిబుచ్చాడు ఇంద్రుడు.

''ఆవిడ మోసే భారం తగ్గాలి''

''భూమాత భారాన్ని తగ్గించే బాధ్యత ఎవరు తీసుకుంటారు?'' అన్న ఇంద్రుడి ప్రశ్నకి జవాబుగా నేనంటే నేనని చాలా మందే చేతులు ఎత్తారు. వారిలో నుండి నలుగుర్ని ఎంపిక చేసి, మీ నలుగురు దిక్పాలకులూ భూభారాన్ని తగ్గించాలి. అందుకు మీకు ఎంత సమయం కావాలి?'' అన్నాడు ఇంద్రుడు.

''మహేంద్రా నా శక్తి తెలిసి నన్నిలా ప్రశ్నించడం అవమానకరం. క్షణాలలో భూభారం తగ్గించేసి వస్తాను.'' మీసాలని చేతుల్తో దువ్వుతూ, దున్నపోతు వాహనాన్ని ఎక్కి ప్రయాణానికి సిద్ధం అయిపోతూ అన్నాడు దక్షిణ దిక్పాలకుడు. దువ్వుకుందుకి తనకి మీసాలు లేకపోవడంతో(మరి సినిమా డైరక్టర్లు, చిత్రకారులూ పెట్టలేదు కదా) ఇంద్రుడి మనసు చివుక్కుమంది. అహం దెబ్బతింది.

''ఒక్కసారిగా క్షణాలలో బరువు తగ్గించెయ్యకూడదు. అదీ అనారోగ్యమే'' అన్న అశ్వినీ దేవతల మాటలతో 'నీకు మీసాలే కాని బుద్రలేదు' అని స్ఫురించేలా ఓ చూపు విసిరాడు ఇంద్రుడు యముడి మీదకి.

యముడి మాటలే తామూ పలుకుదామని నోళ్లు తెరిచిన అగ్నీ, వరుణ, వాయువులు ముగ్గురూ పలకకుండా మూసేశారు తమ నోళ్లని.

''అశ్వినీ దేవతల మాట విన్నారుగా. ఒక్కసారిగా కాకుండా, కొంత నిదానంగా భూభారాన్ని తగ్గించి రండి. బయలుదేరండి'' అంటూ ఆజ్ఞాపించాడు ఇంద్రుడు.

* * *

కాలచక్రంలో ఆరునెలలు గడిచాయి. దేవతలంతా స్వర్గలోకంలో సమావేశం అయ్యారు. భూదేవిని వేదిక మీదకి చేర్చారు. ఆవిడ ముఖం మరింత కళావిహీనంగా, దీనంగా, అనారోగ్యంగా వుంది.

ఇంద్రుడు నలుగురు దిక్పాలకుల్నీ వేదిక మీదకి పిలిచి 'మీరు మీ విధిని సక్రమంగా నిర్వహినట్లు లేదు. భూదేవి అనారోగ్యం మెరుగు పడలేదు సరి కదా, మరింత దిగజారింది' అన్నాడు.

''కార్యాన్ని చూసి, కారణాన్ని ఊహించకు ఇంద్రా. నాటి నుంచి నేటి వరకూ అవిశ్రాంతంగా సముద్రాలలో వాయుగుండాలు సృష్టించాను. వేల కొద్దీ మనుషులు మరణించారు. కొన్ని వేల జంతువులు చచ్చిపోయాయి. పెద్ద పెద్ద వృక్షాలు కూకటి వేళ్లతో కూలిపోయాయి. ఎడారుల్లో ఇసుక తుఫాన్లు సృష్టించి అక్కడ కూడా మారణకాండ సాగించాను. గనుల్లో పని చేస్తున్న వారికి గాలి అందకుండా చేసి భారం తగ్గించాను. ఇంకా.....'' అంటూ సుదీర్ఘమయిన తన కార్యనివేదికను సమర్పించాడు వాయువు.

ఇంద్రుడు వరుణుడి వైపు తిరిగాడు. ''మహేంద్రా నేను కూడా శక్తి మించి కార్య నిర్వహణ చేశాను. కొన్ని ప్రాంతాలలో అతి వృష్టి సృష్టించాను. ఆ నీళ్లల్లో వేల కొద్దీ మనుషులూ, చెట్లూ, ఇళ్లు ఒకటేమిటి అన్నీ సర్వనాశనమై పోయేలా చేశాను. మరి కొన్ని చోట్ల నీళ్ల చుక్క కూడా దొరకకుండా అనావృష్టి సృష్టించాను. తిండి, నీరూ లేక మరణాలు సంభవించేలా చేశాను'' అని జవాబిచ్చాడు వరుణుడు.

వరుణుడి నివేదిక పూర్తి అవుతూనే అతడికి దూరంగా నిలుచున్న అగ్ని తన నివేదిక మొదలుపెట్టాడు. ''మహేంద్రా అడవుల్ని తగల బెట్టాను. పూరి గుడిసెల్ని తగలబెట్టాను. పెద్ద పెద్ద భవనాలలో విద్యుచ్ఛక్తి ద్వారా మంటలు సృష్టించి, వాటిలోని ప్రాణికోటి దహనమయ్యేలా చేశాను. గ్యాసు సిలిండెర్లు బద్దలై మంటలు పుట్టి ప్రజలు మరణించేలా చేశాను. నా శక్తి వంచన లేకుండా ఆహుతి తీసుకున్నాను. దాంతో నాకు అజీర్తి కూడా పట్టుకుంది. ఇప్పుడు అశ్వనీ దేవతల దగ్గర నేను వైద్యం చేయించుకోవాలి''అంటూ పెద్దగా పదే పదే త్రేన్పడం మొదలుపెట్టాడు.

తనని ప్రశ్నించే లోపే యముడు దున్నపోతు మీద నుంచి దిగి, దాని వీపు మీద విలాసంగా చేయి ఆన్చుకొని నిలబడి 'భూభారాన్ని తగ్గించడంలో నా కృషే ఎక్కువ మహేంద్రా. వీరి ముగ్గురి ప్రయత్నాలూ సఫలమయ్యేలా నేను తోడ్పడ్డాను. భూమ్మీద తీవ్రవాదులనే ఒక జాతి వారు రకరకాల బాంబులనే మారణాయుధాల తోనూ, పెద్ద పెద్ద విమానాలని ఎత్తయిన భవనాలకి ఢీ కొట్టించి మనుషులని అంతం చెయ్యడానికి ప్రయత్నిస్తూంటే వారికి సహకరించి భూభారాన్ని తగ్గించడంలో నా భాగం కర్తవ్యాన్ని నేను నిర్వహించాను. ఎన్ని వేల మంది భూమి మీద నుంచి తొలగిపోయారో చిత్రగుప్తుడి దగ్గర చిట్టా వుంది. చదివి వినిపించమంటావా మహేంద్రా?'' అన్నాడు ఉత్సాహంగా.

'అమ్మో ఇప్పుడా చిట్టా అంతా వినాలి అని సభికులు కలవర పడుతూంటే, ఇంద్రుడు 'అక్కర్లేదు' అని అందరికీ ఊరట కలిగించి, 'అశ్వినీ దేవతల్లారా మీ వైద్యం వికటించింది. భూభారం

మళ్లీ తెచ్చేవా మావిడి పండూ? టెంక పుచ్చుక్కూచుంటే అవతల పన్లు పాడవుతున్నాయని చెప్పేనా లేదా?!



తగ్గించినా ఆమె ఆరోగ్యం బాగుపడలేదు'' అంటూ ఆరోపించాడు.

''మా శక్తిని శంకించడానికి వీలు లేదు. ఎక్కడో ఏదో లోపం జరిగింది'' అని ఇంద్రుడితో అని,

''భూమాతా, నీ భారం తగ్గినా నీ ఆరోగ్యం బాగుపడలేదంటే నీకేదో మానసికమయిన బాధ వుండి వుండాలి. మనోవ్యాధికి మందులేదు. నీ బాధేమిటో చెప్పు'' అని ప్రశ్నించారు.

''దేవ వైద్యుల శక్తిని శంకించనవసరంలేదు దేవేంద్రా. అధికమయిన భూభారమే నా అనారోగ్యానికి కారణం. నా భారం తగ్గిన మాట కూడా వాస్తవమే. నా ఆరోగ్యం కోసం తీవ్రవాదంతో, వరదలతో, తుఫాన్లతో, కరువు కాటకాలతో నా బిడ్డలు అల్పాయుష్కులై అర్థాంతరంగా నా మీద నుంచి వెళ్లిపోతే నేను తట్టుకోలేకపోతున్నాను. పిల్లల్ని పోగొట్టుకున్న కన్నవారూ, కన్నవారిని పోగొట్టుకుని అనాథలైన చిన్నారులూ, భర్తలు పోయిన భార్యలూ, భార్యలు పోయిన భర్తలూ-దుఃఖంతో రోదిస్తుంటే నాకు మనశ్శాంతి ఎలా లభిస్తుంది? ఈ క్షోభని నేను తట్టుకోలేకపోతున్నాను'' అంటూ తన ఆవేదనని వ్యక్తం చేసింది భూదేవి.

''మనసు ఆనందంగా లేకపోతే శరీరం ఆరోగ్యంగా వుండదు'' అన్నారు అశ్వినీ దేవతలు.

''భూమి భారం తగ్గిస్తేనే కానీ ఆవిడ ఆరోగ్యం బాగుపడదు. భారం తగ్గిస్తే ఆవిడ మానసికా రోగ్యం దెబ్బతింటోంది. ఏమిటీ సమస్యకు పరిష్కారం?'' అంటూ వేయి కళ్లు మూసుకొని తల పట్టుకున్నాడు ఇంద్రుడు.

''ప్రభూ నాకు ఒక్క అవకాశం ఇస్తే ఈ సమస్యని నేను పరిష్కరిస్తాను'' అంది ఉందో లేదో అన్నట్లున్న నడుం మీద చెయ్యి వేసుకొని వయ్యారంగా నిలబడిన ఊర్వశి.

''దిక్పాలకులే ఏమీ చెయ్యలేకపోయారు. నువ్వేం చేస్తావు? నీకు చేతనయిన నాట్యం చేసి కాస్సేపు భూదేవి మనసు రంజింప చేస్తావు. దానితో ఈ సమస్య పరిష్కారం కాదు'' అన్నాడు ఇంద్రుడు వెటకారం గొంతులో ధ్వనించకుండా ప్రయత్నిస్తూ.

''ఒక స్త్రీ మనసు మరో స్త్రీకే బాగా అర్థం అవుతుంది. ఆమెనీ ఒక ప్రయత్నం చేయనియ్యి ఇంద్రా'' అంటూ భూదేవి ఊర్వశి మాటని బలపరిచింది.

''నీకెంత సమయం కావాలి? మరో ఆరునెలలా?''అన్నాడు ఇంద్రుడు వ్యగ్యంగానే.

''రెండు నెలలు చాలు'' ఆత్మస్థైర్యంతో ఇంద్రుడికి జవాబిచ్చి భూదేవి వైపు ఆత్మీయంగా చూసింది ఊర్వశి. ఆ చూపులో తన సమస్యని ఊర్వశి పరిష్కరించగలదన్న విశ్వాసం కనపడింది భూదేవికి.

* * *

ఆనాటి సమావేశానికి ఏనాడూ హాజరుకాని దేవతలంతా కూడా విచ్చేశారు. భూదేవి ఆరోగ్యం బాగుపడి వుంటుందా లేదా అని తర్జన భర్జనలు పడుతున్నారు అందరూ. ఫలితం మీద పందాలు కడుతున్నారు కొందరు. సభా సమయం అయ్యింది. ఇంద్రుడు వచ్చాడు. భూదేవిని ప్రవేశపెట్టమని ఆదేశించారు.

అందంగా, ఆరోగ్యంగా, నాజుకుగా ఉన్న ఊర్వశి ముందు ఉండి తోడ్కొని వస్తుంటే ఆమె వెనుకే మరో ఊర్వశిలా భూదేవి వయ్యారంగా ప్రవేశించింది. ఆమె ముఖం కళకళలాడిపోతోంది.

ఆశ్చర్యంతో సభికుల నోట మాట రాలేదు.

మహామహులనిపించుకున్న నలుగురు దిక్పాలకులు ఆరు నెలలు నిర్విరామంగా ప్రజలని అష్టకష్టాలు పెట్టి అధ్వాన్నంగా తయారుచేసిన భూదేవి ఆరోగ్యాన్ని ఒక స్త్రీ ఒంటరిగా, కేవలం రెండునెలల్లో ఎలా మెరుగు పరచిందో తెలుసు కోవాలని ఉత్సాహం వ్యక్తపరిచారు సభికులంతా.

ఇంద్రుడు అనుమతి సూచకంగా ఊర్వశి వైపు చూశాడు.

''నా చిత్రగుప్తుడి చిట్టాలోకి కొత్త పేర్లేమీ నమోదు కాలేదే? మరి భూభారం ఎలా తగ్గిందో నాకు అర్థం కావడం లేదు. ఊర్వశి నువ్వేమయినా ఇంద్రజాలం చేశావా?'' అని యముడు ప్రశ్నిస్తుంటే, ఊర్వశి విజయంలో తన పేరు చోటు చేసుకుంటోందని మోహన చిరునవ్వు పులుముకున్నాడు ఇంద్రుడు.

ఊర్వశి ఇంద్రుడికి, సభాసదులకీ నమస్కరించి, భూదేవి వైపు ప్రేమగా చూసి, ''ఇందులో ఇంద్రజాలాలు, మహేంద్రజాలాలు ఏమీ లేవు'' అనగానే ఇంద్రుడి ఆనందం మాయం అయ్యింది.

''భూభారం తగ్గించడానికి జన సంఖ్యని తగ్గించడమే మార్గం కాదు. జనాభాని అలాగే వుంచి వారి బరువుల్ని తగ్గిస్తే సరిపోతుంది. పది మంది బక్క ప్రాణులని చంపినా, ఇరవై మంది లావుగా వున్నవారి బరువు తగ్గించినా భూభారం ఒకేలా తగ్గుతుంది కదా....?'' అంటూ ఓరకంట ఇంద్రుడిని, దిక్పాలకుల్నీ చూస్తూ వయ్యారం ఒలకబోస్తూ అంది ఊర్వశి.

ఈ మాత్రం ఆలోచనే తమకి తట్టలేదే అని వెర్రి మొహాలేసి బుర్రలు గోక్కున్నారు మగ దేవతలు. 'ఆహా! ఓహో' అంటూ అభినందించారు ఆడదేవతలు.


కాస్తంత నిభాయించుకుని, ''వాళ్లందరి బరువు తగ్గించడం మనకెలా సాధ్యం?'' అని డాంబికంగా ధర్మ సందేహం వ్యక్త పరిచాడు యమధర్మరాజు.

'అదెంత పని అన్నట్లు ఓ చూపు చూసీ,' నేను కార్యరంగంలోకి దిగే ముందు, ఈ పనిని ఎలా సాధించాలో ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నాను. ఆ ప్రణాళిక విజయవంతం కావడానికి బ్రహ్మ సరస్వతుల అనుగ్రహం పొందే భూమ్మీదకి వెళ్లాను.

భూమి మీద కొందరు సౌందర్య ప్రియులున్నారు. కొందరు మానసికంగా బాధపడు తున్నవారు, పడుతున్నామనీ అనుకునేవారూ వున్నారు. వారి వారి మనసులకి అనుగుణంగా బరువు తగ్గాలనే కోరికని పుట్టించాలి అనుకున్నాను.

బరువు తగ్గితే ఎంత అందంగా కనపడవచ్చో చెప్పాలనే ఆలోచనని కొంతమంది బుర్రలోకి ఎక్కించాను. వారు ఈ విషయం గురించి భూమ్మీద ఉన్న ప్రసార మాధ్యమాల ద్వారా నిత్యం ఊదరగొట్టేశారు. ఇంకా ఊదరగొడుతున్నారు. దాంతో సౌందర్య పిపాసకులంతా బరువు తగ్గించుకునే దీక్షలో పడ్డారు. ఆరోగ్యానికి బరువు తగ్గడం ఎంత అవసరమో చెప్పాలనే ఆలోచనని రకరకాల వైద్యరంగాల వారి బుర్రలలోకి ఎక్కించాను. వారు అదేపనిగా పత్రికల్లో, టీవీలలోనూ ఈ విషయమే హోరెత్తించేవారు. గురువులూ బాబాల మీద గురి వున్న వారి కోసం అటువంటి వారి చేత టీవీలలో చెప్పించాను.

మానసిక అశాంతి తగ్గడానికీ, ఆత్మజ్ఞానానికి రకరకాల ప్రాణాయామాలు, ఆహారం నియమాలు చెప్పే ఆధునిక గురువులని తయారు చేశా. వారు ప్రపంచ వ్యాప్తంగా శిష్యులని తయారు చేసుకొని



నా లక్ష్య సాధనలో సాయపడుతున్నారు. అందం కోసమో, ఆరోగ్యం కోసమో బరువు తగ్గించే మార్గాల కోసం వెదకడం మొదలుపెట్టారు జనం.

అటు చూడండి యావత్ప్రపంచం మీద ప్రజలు ఏం చేస్తున్నారో..'' అని ఊర్వశి అనగానే

ఇంద్రభవనంలో వున్న దేవతలంతా మేఘమండలంలోకి ప్రవేశించి, భూమి మీదకి తొంగి చూడ్డం మొదలుపెట్టారు.

అక్కడ కొందరు అదే పనిగా నడిచిన చోటే నడుస్తున్నారు. కొందరు పరుగులు తీస్తున్నారు. రకరకాల వ్యాయామాలు చేస్తున్నారు కొందరు. దీర్ఘంగా గాలి పీల్చి రకరకాలుగా వదులుతున్నారు కొందరు. యోగా కేంద్రాలలో కిటకిటలాడుతూ జనం యోగాసనాలు వేస్తున్నారు. వయోబేధం లేకుండా, పెద్ద పెద్ద యంత్రాల సహాయంతో వ్యాయామం చేస్తున్నారు మరి కొందరు. మాత్రలు మింగుతున్నారు కొందరు. కోయవారిచ్చే మూలికలు పుచ్చుకుంటున్నారు కొందరు. విందు భోజనాలు మానేసి చప్పిడి కూరలూ, మంచినీళ్లతో కడుపు నింపుకుటున్నారు మరికొందరు.

ఏ ఇంట చూసినా, ఏ ఊళ్లో చూసినా, ఏ దేశంలో చూసినా, ఏ ఖండంలో చూసినా ఇవే దృశ్యాలు....భిన్నత్వంలో ఏకత్వం...

గగన వీధి నుంచి దీక్షగా మానవులనే చూస్తున్న దేవతలతో...

''ఇప్పుడు ప్రజలందరికీ ఒకటే లక్ష్యం. ఒకటే దీక్ష. ఒకటే మంత్రం. బరువు తగ్గాలి... బరువు తగ్గాలి... రెండు నెలల్లో ఈ విధానం ద్వారా ఒక కోటి కిలోల భూభారం తగ్గింది. అదే ఇతర సమస్యల బాధ లేకుండా, ఒక పక్కభూమి బరువు తగ్గడం, మరో వైపు తన బిడ్డలంతా ఆనందంగా వుండడం వలన కలిగే మానసిక ఆనందం. ఇదే భూమాత ఆరోగ్య రహస్యం'' అని ఆనందంగా ముగించింది ఊర్వశి.

దేవతలంతా కరతాళ ధ్వనులతో ఆమెని అభినందించారు.

ఆ వెంటనే వారంతా పక్కనే సిద్ధంగా వున్న పంచభక్ష్యాల వైపు చూడడం మానేసి, భూమి మీదకు దృష్టి సారించి మానవులు చేస్తున్న ప్రాణాయామాలు, యోగాసనాలు, వ్యాయామాలు, వగైరా యధాశక్తి అనుకరించి చేయడం మొదలుపెట్టారు. ప్రశ్నార్థకంగా చూసిన ఊర్వశికి 'స్వర్గలోక బరువు పెరిగిపోకుండా ముందు జాగ్రతపడదామనీ...' అని నీళ్లు నములుతున్నట్లు జవాబిచ్చారు.

కాని మానవులంతా బరువు తగ్గి అందంగా తయారయిపోతే తమ సౌందర్యానికి విలువ తగ్గిపోతుందేమోనని భయం వారి మనసులలో చోటు చేసుకున్నదనే విషయం అర్ధమయిన ఊర్వశి తనలో తానే నవ్వుకుంది గర్వంగా

*



## మమతా సెన్సేషన్

సంచలనాలకు ఆలవాలం సినీ ప్రపంచం. అందం, గ్లామర్ ఇక్కడ అక్కచెల్లెళ్లలాంటివి. ఈరెండూ ఏమాత్రం వున్నా సంచలనాలకు కేంద్రబిందువుగా మారవచ్చు. మమతా మోహన్‌దాస్ టాలీవుడ్‌లో సృష్టిస్తున్న సంచలనాలు చూస్తూంటే ఔరా అనుకోక తప్పదు. తొలుత సింగర్‌గా సినీ ప్రవేశం చేసినా తరువాత యాక్టర్‌గా మారి తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల కన్నడంలో ఆమె నటించిన 'కూలీ' సినిమా కలెక్షన్లలో రికార్డులు నెలకొల్పింది. మొదటి వారంలోనే మూడు కోట్ల రూపాయలు వసూలు చేసిన ఈ సినిమాను తెలుగులో రీమేక్ చేయడానికి నిర్మాత సన్నాహాలు చేస్తున్నారట! రజనీకాంత్' కుచేలుడు'లో కూడా ఓ పాటలో నర్తిస్తోంది. రజనీకాంత్ సినిమాలో ఓ చిన్న షాట్‌లో కనిపించడానికైనా హీరోయిన్లు పోటీపడుతుంటారు. అలాంటిది ఓ పాటలో డ్యాన్స్ చేసే ఛాన్స్ కొట్టేయడం మామూలు విషయం కాదని అంటున్నారు.